విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 13 ఆగస్టు 2025 8 పేజీలు

కనుమరుగుకానున్న రిజిస్టర్ పోస్ట్

- స్పీడ్ పోస్టులో విలీనం
- సెప్టెంబరు 1 నుంచి అమలు
- తపాలాశాఖ కీలక నిర్ణయం



విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రజలతో పోస్టల్ శాఖకు విడదీయరాని బంధం. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు తపాలా శాఖ. ఈ శాఖ కాలంతోపాటు మారుతూ..ప్రైవేటు సంస్థలకు దీటుగా సమాచార సేవలను కొనసాగి స్తోంది. పౌర సేవలు, ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సైతం అందిస్తోంది. బ్రిటీష్ కాలం నాటిదైన రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్ట్ విభాగంలో విలీనం చేయాలని భారత తపాలా శాఖ నిర్ణయించింది. సెప్టెంబర్ 1 నుంచి దీనిని అమలు చేయనుంది. అంటే ఇకపై తపాలా శాఖలో రిజిస్టర్ పోస్టు కనుమరుగు కానుంది.

బ్రిటీష్ కాలం నాటిది

తపాలా శాఖలో రిజిస్టర్ పోస్టుది సుదీర్ఘ చరిత్ర. 1854లో రిజిస్టర్ పోస్ట్ సేవలను అప్పటి బ్రిటీష్ చక్రవర్తి లార్డ్ డల్హౌసి ప్రవేశపెట్టారు. అప్పటి ఇండియన్ పోస్టాఫీస్ చట్టంతో రిజిస్టర్ పోస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి. అంతకుముందు 1763లో వారెన్ హేస్టింగ్స్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో "కంపెనీ మెయిల్" ప్రారంభమైంది. దాదాపు 171 సంవత్సరాల పాటు రిజిస్టర్ పోస్టు సేవలందించింది. ముఖ్యమైన పత్రాలను, వస్తువు లను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ముఖ్యంగా లీగల్ నోటీసులు, అపాయింట్మెంట్ లెటర్లు,బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటి వాటిని పంపడానికి ఇది ఎంతగానో ఉపయోగ పడింది. పంపించిన వస్తువు, పత్రం అవతల వారికి చేరినట్లు రసీదు (డెలివరీ ప్రూఫ్) పొందడం దీని ప్రత్యేకత. ఇది చట్టపరంగా కూడా ఎంతో విలువైనది.

ఆధునికీకరించేందుకే...

తపాలా సేవలను మరింత ఆధునీకీకరించేందుకు తపాలా శాఖ రిజిస్టర్ పోస్ట్ విలీనంపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు మెరుగుపరుచుకోవడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయటం వంటివి విలీన ప్రక్రియకు కారణాలుగా తెలుస్తోంది. స్పీడ్ పోస్ట్ అనేది వేగవంతమైన ▶మిగతా 2లో..

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత
- సమష్టి కృషితో వర్సిటీ విలువలు కాపాడదాం : వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ
- నన్నయ వర్సిటీలో యాంటీ ర్యాగింగ్ వీక్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆనందంగా జీవితాన్ని గడపాలని, ఇతరులను ఇబ్బందికి గురిచేయాలని, బాధపెట్టాలనే మానసిక రుగ్మతే ర్యాగింగ్ అని, ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. మంగళవారం ▶మిగతా 2లో..

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: విక్షిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడానికి పటిష్టమైన, అధిక నాణ్యత గల పాఠశాల విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో "విక్షిత్ భారత్ లక్ష్యంగా పాఠశాల విద్య - నిర్మాణ విభాగాలు" అనే అంశంపై జిల్లాలోని విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాపులో కలెక్టర్ పాల్గొని ▶మిగతా 2లో..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: విద్యార్థులు మత్తు పదార్థాలు, ర్యాగింగుకు దూరంగా ఉండాలని, ర్యాగింగ్ కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏలూరు) బోయపాటి శ్రీలత సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్ర ప్రదేశ్ (ఏపీ నిట్) లో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యాంటీ ర్యాగింగ్ డే, నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని వివరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏలూరు) కే.వి.ఎన్. ప్రభుకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొదట్లో సరదాగా మొదలు పెట్టిన డ్రగ్స్ అలవాటు తరువాత వ్యసనంగా మారి జీవితాలను గుల్ల చేస్తుందని

తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే వాటి నుంచి కోలుకోవడం చాలా కష్టమవుతుందని వివరించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టాలు చాలా కఠినంగా ▶మిగతా 2లో..

సీపీఐ మహాసభలు విజయవంతం చేయండి

- క్విట్ ఇండియా స్ఫూర్తితో రైతుల సమస్యలపై పోరాడండి
- సీపీఐ జిల్లా సమితి విజ్ఞప్తి

విశాలాంధ్ర - కాకినాడ/రామచంద్రపురం : ఒంగోలులో జరుగనున్న భారతకమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రామచంద్రపురంలో ఉండవల్లి గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. 23 వతేదీన భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో పార్టీనిర్మాణం, ప్రజాపోరాటాలు, భవిష్యత్ కార్యక్రమం రాష్ట్ర మహాసభలలో చర్చించి రూపొందిస్తారని తెలిపారు. ఆగస్టు 13 వతేదీన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు కె. సత్తిబాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు శీలం వెంకటేష్, పెద్దిరెడ్డి రాము, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, జి. రవికుమార్, చెల్లుబోయిన తాతాజీ, నిమ్మకాయల శ్రీనివాసరావు, గెద్దం ప్రభాకరరావు, జేసురాజు మాస్టారు, చిట్టూరి ప్రసాద్, వి. శామ్యూల్, డి.చిట్టిరాజు, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

రూ.14 లక్షల అవినీతి

- డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్
- అనధికార భూ రికార్డుల మార్పులు
- ఇద్దరు వీఆర్ఏ లపై క్రమశిక్షణా చర్యలు
- కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : లేని భూమి ఉన్నట్లు చూపించి మాజీ సైనిక ఉద్యోగి నుండి రూ.14 లక్షలు లంచం వసూలు చేసిన ఘటనపై తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ , జిల్లా మేజిస్ట్రేట్ పి. ప్రశాంతి కఠిన చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. గోపాలపురం మండలం ఎలక్షన్ డిటి ప్రస్తుతం కొవ్వూరులో డిప్యూటేషన్ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎస్. కృష్ణపై విచారణ పెండింగ్‌లో ఉంచి సస్పెండ్ చేయడమే కాకుండా, ఈ ఘటనలో భాగం అయిన సంబంధిత వీఆర్ఏలు జి. మనోహర్ (కరగపాడు), ▶మిగతా 2లో..

ఘనంగా లైబ్రేరియన్స్ డే

విశాలాంధ్ర -భీమవరం: డిఎన్నార్ సెంట్రల్ లైబ్రరీలో మంగళవారం లైబ్రేరియన్స్‌డే ఘనంగా నిర్వహించి గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాధన్‌కు నివాళులు అర్పించారు.

డిఎన్నార్ విద్యా సంస్థల అధ్యక్షుడు గోకరాజు నరసింహ రాజు, సెక్రటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, పాలక వర్గ సభ్యులు పి.రామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ జి.మోజెస్ లైబ్రేరియన్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ ఎం.వెంకట్, ఇంజనీరింగ్ కళాశాల లైబ్రేరియన్ ఎం.శిరీష, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శాఖ గ్రంథాలయంలో: గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్. రంగనాధన్ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాల నిర్వహణను సమాజానికి చేరువ చేసిన ఘనత రంగనాధన్‌కు దక్కుతుందని కొనియాడారు. కార్యక్ర మంలో గ్రంథాలయ సిబ్బంది, చదువరుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందులు పంపిణీ

విశాలాంధ్ర-టి.నరసాపురం: మర్రిగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా

అధికారి ఎన్ఏ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్ బెండజోల్ పంపిణీ చేసి బాలికలకు వాటి ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆహార పదార్థాలు తినేముందు చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలందరూ నులి పురుగు నివారణ మాత్రలు వేసుకొని ఆరోగ్యంగా వుండాలని ఆయన తెలిపారు. అనంతరం కీటక జనిత వ్యాధులు, నివారణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె. శ్రీనివాసరావు, ఎమ్ ఎల్ హెచ్ పి రోహిణి, వి హెచ్ ఎస్ విజయశాంతి, ఆశాలు లావణ్య, గంగ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి (1వ పేజీ తరువాయి)

పి. నాని (గోపాలపురం)లపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు గోపాలపురం తహసిల్దార్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ను కలిసి మాజీ సైనికులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్(కెఆర్ సిసి) కె భాస్కర్ రెడ్డిని సమగ్ర విచారణ చేసి నివేదిక అందచేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. సదరు దర్యాప్తు అనంతరం ఎన్‌డిసి అందచేసిన నివేదికలో రెవెన్యూ రికార్డుల్లో అనధికార మార్పులు చేసి, నకిలీ పట్టాదారు పాస్‌బుక్ జారీ చేసినట్లు నివేదికలో స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రయోజనం దృష్ట్యా సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి తీరు వంటి వాటిని ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో క్రమశిక్షణ చర్యలు విధానాన్ని కొనసాగిస్తూ, దర్యాప్తులో పాక్షికతకు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

దూరంగా ఉండాలి

(1వ పేజీ తరువాయి)

ఉన్నాయని, ప్రతి విద్యార్థి చట్టంపై అవగాహనను కలిగి ఉండాలని వివరిం చారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఏపీ నిట్ అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యా సంస్థల్లో ర్యాగింగ్, డ్రగ్స్ నివారణ కోసం ప్రత్యేకంగా యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేశామని వివరించారు. తాడేపల్లిగూడెం సీఐ రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే ఎలాంటి శిక్షలు విధిస్తారో సెక్షన్లతో సహ వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ తాడేపల్లిగూడెం సీఐ స్వరాజ్య లక్ష్మి, పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలోపేతం చేయాలి

(1వ పేజీ తరువాయి)

పలు సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రధానమంత్రి వ్యక్తీకరించబడిన "విక్షిత్ భారత్" దార్శనికత, భారతదేశాన్ని 100వ స్వాతంత్ర్య దినోత్సవంతో సమానంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చడం లక్ష్యంగా అన్ని రంగాలలో నిరంతర లక్ష్య నిర్దేశం, సాధన అవసరం అన్నారు. విక్షిత్ భారత్‌ను సాధించడానికి ఆర్థిక వృద్ధిని, సామాజిక సమానత్వం, ప్రపంచ పోటీతత్వం, పర్యావరణ స్థిరత్వం, పారిశ్రామిక ఆధునీకరణ, సుపరిపాలన, భారతదేశం ప్రపంచ జ్ఞాన సూపర్ పవర్‌గా ఆవిర్భవించడానికి సమగ్రమైన విధానం అవసరం అన్నారు. దీని నిర్మాణంలో అత్యంత కీలకమైనది నాణ్యమైన పాఠశాల విద్య అన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఆరోగ్యంగా ఉండడం ఎంతో కీలకమైనదన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టు సాధించేలా బోధించాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ మీద దృష్టి సారించేలా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో డిజిటల్ టెక్నాలజీ అందుబాటులో ఉందని విజువలైజేషన్ ద్వారా విద్యను అందిస్తే ఎక్కువగా గ్రహించగలుగుతారని సూచించారు. వర్క్‌షాపులో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, సమగ్ర విద్య ఏపీసి పి.శ్యాంసుందర్, డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కఠినచర్యలు

(1వ పేజీ తరువాయి)

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో యాంటీ ర్యాగింగ్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ హాజరై విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. జ్యోతి ప్రజ్వలన చేసి, నన్నయ విగ్రహానికి పూలమాల వేసి యాంటీ ర్యాగింగ్ వీక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో మమేకం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడానికి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు. విద్యాలయాలలో చక్కని ఆనందకరమైన వాతావరణం ఉండాలని, దానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఆదర్శప్రాయులుగా ఉండాలన్నారు. తల్లి దండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారని, అందరి కుటుంబ నేపథ్యం ఒకే విధంగా ఉండదని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నత విద్యలో రాణించాలన్నారు. వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో ఈ నెల 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు యాంటీ ర్యాగింగ్ వీక్ ను నిర్వహిస్తున్నామని, నూతనంగా విశ్వవిద్యాలయంలో ప్రవేశించే విద్యార్థులకు చక్కని వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు. యూజీసీ ర్యాగింగ్‌ను అరికట్టడంపై నిబంధనలు (2009) మరియు భారత సుప్రీంకోర్టు ఆదేశాలు బహిష్కరణ, జరిమానాలు మరియు క్రిమినల్ అభియోగాలు వంటి కఠినమైన చర్యలను ఆదేశించిందన్నారు. విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ, స్క్వాడ్స్ హాస్టళ్లు, తరగతి గదులు, సాధారణ ప్రాంతాలను చురుకుగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. దుష్ప్రవర్తనను అరికట్టడానికి సీసీ టీవీ నిఘా, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. యాంటీ ర్యాగింగ్ వారంలో భాగంగా ఎవరిని ర్యాగింగ్ చేయను అని సభలో ఉన్నవారు అందరితో వీసీ ప్రతిజ్ఞ చేయించారు. అనం తరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను వీసీ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందిం చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎన్.ఉదయభాస్కర్, యూనివర్సిటీ లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, సీనియర్ అడ్వకేట్ వెంట్రప్రగడ ఉమామహేశ్వరి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్టర్ పోస్టు

(1వ పేజీ తరువాయి)

డెలివరికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టుల సేవలు స్పీడ్ పోస్ట్‌లో విలీనం అయితే..డెలివరీలు మరింత వేగవంతం అవుతాయి. ముఖ్యంగా స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిల్ ఎక్కడికి వెళ్లిందో ఆన్ లైన్ లో పరిశీలించుకునే సౌకర్యం సైతం ఉంటుంది. ఈ ఆప్షన్ రిజిస్టర్ పోస్టులో లేదు. ఒకే సేవ ఉండటం వల్ల తపాలా సేవలు మరింత సులువు అవుతాయి. సిబ్బందిపై పని భారం కూడా తగ్గుతుంది. ప్రభుత్వ శాఖలే ఎక్కువగా రిజిస్టర్ పోస్టు సేవలను వినియోగించుకునేవి. అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ రిజిస్టర్ పోస్టు ద్వారా చేసేవి. అందుకే ముందుగా తపాలా శాఖ ప్రభుత్వ శాఖలకు ఈ విషయంపై సమాచారం అందించింది. సెప్టెంబర్ 1న విలీన ప్రక్రియ ఉండడంతో అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. రిజిస్టర్ పోస్టును నిలిపివేస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడ్ పోస్ట్ లో విలీనం చేస్తే రుసుం పెరుగుతుందని, అదనపు భారం తప్పదని భావిస్తున్నారు. రిజిస్టర్ పోస్ట్ చార్జీ రూ.26 ఉంటే...స్పీడ్ పోస్ట్ చార్జీ రూ.41 వరకు ఉంటుందని పేర్కొంటున్నారు.స్పీడ్ పోస్ట్ చార్జీలు తగ్గించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రామానికి చెందిన పెరిచర్ల శింగరాజు, వెంకట సుబ్బాయమ్మ దంపతుల

మెమోరియల్ ట్రస్ట్ 5వ వార్షికోత్స వాన్ని పురస్క రించుకుని కళాశా లలో ప్రథమ సంవత్సరం చదువుతున్న 90 మంది విద్యార్థులకు సుమారు రూ.70 వేల విలువ చేసే యూనిఫాంను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా గణపవరం సొసైటీ చైర్‌పర్సన్, టిడిపి నాయకులు కునంపూడి సురేంద్ర కుమార్‌రాజు మాట్లాడుతూ విద్యా సంస్థలకు దాతల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. రాబోయే కాలంలో దాతలు సహకరించి విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయాలని ఆయన కోరారు. అబ్బాయిరాజు, సుబ్బరాజు, నాగరాజు, శివ నాగ రాజు, కాపవరం చిన్ని, పల్లి వెంకటేశ్వర రావు, కళాశాల అధ్యాపకులు నాగేశ్వరశర్మ, సాయిబాబా, కిరణ్ బాబు, స్వామి దొర, పి. ప్రేమలత, సీతా మహాలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థికి వైద్య సేవలు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న టి.జీవన్ కుమార్ అస్వస్థతకు గురయ్యాడు.దీంతో ఆ విద్యార్థిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య నిమిత్తం తీసుకువెళ్లారు.ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ విద్యార్థికి అన్ని పరీక్షలు నిర్వహించారు. ఎటువంటి ప్రమాదం లేదని, ముందు జాగ్రత్తగా పెద్ద ఆసుపత్రిలో వివిధ పరీక్షలు చేయాలని సూచించారు.దీంతో బాలుని తల్లిదండ్రులు కుమారుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కొప్పుల వారిగూడెంకు చెందిన ఈ విద్యార్థి ధర్మాజీగూడెం లోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వార్డెన్,పాఠశాల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపుతున్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు

విశాలాంధ్ర -ముసునూరు: మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు ప్రభుత్వం నిర్దేశించిన తేదీల్లో తప్పనిసరిగా వేయా లని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి ఆయా సెంటర్ల టీచర్లకు సూచించారు. జాతీయ నులి

పురుగుల నిర్మూలన దినం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముసునూరు మండలం చింతలవల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లో టీచర్ రాజేశ్వరి హాజరై పిల్లలకు, వారి తల్లిలకు చేతులు శుభ్రపరచుకొనే విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నులిపురుగుల మాత్రలు పొడిచేసి తల్లుల సమక్షంలో వరుస క్రమంలో పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీస్ హెల్త్ యానిమేటెడ్ పద్మజ, ఉమెన్ యానిమేటర్ సంపూర్ణం, ఆశా వర్కర్ రాజేశ్వరి, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

15న ఎల్బీచర్లలో ఉచిత వైద్య శిబిరాలు

విశాలాంధ్ర-నరసాపురం : వాసవి క్లబ్ నరసాపురం ఆధ్వర్యంలో ఈ నెల 15న ఎల్బీచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు నూలి శ్రీనివాస్, కంచర్ల బాబ్జి, కోట్ల బాలకృష్ణ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకానికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ రాష్ట్రవ్యాప్తంగా సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఈనెల 15 నుండి ప్రవేశపెడు తున్న స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం అమలుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రజా రవాణా శాఖ ప్రాంతీయ అధికారి ఎస్.కె. షబ్నం తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విధి విధానాలు వెల్లడించారు.

ఉచిత బస్సులలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుండి 162 పల్లె వెలుగు బస్సులు,15 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఈ పథకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఏలూరు నుండి 23, జంగారెడ్డిగూడెం నుండి 22, నూజివీడు నుండి 18 రూట్ల మొత్తం 63 రూట్లలో ఉచితంగా ప్రయాణించ వచ్చన్నారు. ప్రయాణ సమయంలో, బస్సులు ఎక్కే సమయంలో ఒకరినొకరు తోసుకోకుండా బస్సు ఎక్కాలని, తోపులాట వల్ల నగలు,సెల్ ఫోన్లు దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నది కాబట్టి జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి,పిఆర్వో నరసింహం పాల్గొన్నారు.

మహిళలకు శక్తి యాప్ డౌన్లోడ్ తప్పనిసరి

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : మహిళలకు నిత్యం అందుబాటులో ఉండే శక్తి యాప్ డౌన్లోడ్ తప్పనిసరిగా చేయించాలని జీలుగుమిల్లి ఎస్ఐ వి. క్రాంతికుమార్ సూచించారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో మహిళా

పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ముందస్తు సమాచారం ఇవ్వాలని తెలిపారు. శక్తి యాప్ గురించి గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. నిత్యం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి రక్షణ కల్పించాలని తెలిపారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - నరసాపురం : ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 13న నరసాపురంలోని అన్ని కోర్టు సముదాయాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ నున్నట్లు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, చైర్ పర్సన్ ఎ. వాసంతి మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు.

ఆయా కోర్టులలో ఉన్న రాజీపడతగిన అన్ని క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, సివిల్ కేసులు, భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్ట పరిహార కేసులు మొదలగునవి రాజీ చేసుకోవచ్చునన్నారు. ప్రతి రోజు కోర్టు సముదాయంలో జరుగుచున్న మధ్యవర్తిత్వం ద్వారా కూడా కక్షిదారులు తమ కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటు ఉందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొనుటకు వారి వారి న్యాయవాదుల ద్వారా గాని, సంబంధిత పోలీసు వారిని లేదా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించాలన్నారు. బ్యాంక్, బి.ఎస్.ఎన్.ఎల్‌కు సంబంధించిన లావాదేవీలు ప్రి లిటిగేషన్ కేసుల క్రింద సెటిల్ చేసుకోవచ్చునన్నారు. వర్చువల్ గా కూడా కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటును ఉన్నత న్యాయస్థానాలు కల్పించినట్లు న్యాయమూర్తి తెలిపారు.

సహకార సంఘ అభివృద్ధికి కృషి చేస్తా

లక్ష్మణ్ ప్రతాప్

విశాలాంధ్ర-లింగపాలెం: విదేశంలో ఉన్నత ఉద్యోగాన్ని వదిలి తండ్రి ఆశయాన్ని నిలబెట్టడానికి స్వదేశం తిరిగి వచ్చి వ్యవసాయ రంగంలో ఆధునిక విధానాలతో విజయాలు సాధించి సొసైటీ చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు మందలపు లక్ష్మణ ప్రతాప్ అలియాస్ నాని. ఈయన జీవిత గాధ ఒక ఆదర్శం అని చెప్పొచ్చు. కే.గోకవరంకు చెందిన మందలపు శ్రీకృష్ణ, పార్వతి దంపతులకు కొడుకు, కుమార్తె. లక్ష్మణ్ ప్రతాప్‌కు చదువు అంటే ఆసక్తి. మంచి ఉద్యోగం చేయాలని చిన్నప్పటి నుంచి ఈయన ఆశయం. దీంతో చదువు పట్ల ఆసక్తితో ప్రాథమిక స్థాయి నుంచి కాలేజీ విద్య వరకు ఏలూరులో చదివారు.ఆ తరువాత చెన్నైలో ఎంబీఏ చేశారు.ఎంబీఏ పూర్తి చేసిన వెంటనే ఈయనకు ఖతార్ దేశ రాజధానైన దొహా పట్నంలోని షిప్పింగులో లాజిస్టిక్ కోఆర్డినేటర్ అధికారిగా ఉద్యోగం రావటంతో ఈ ఉద్యోగంలో చేరారు. 2006 నుంచి2012 వరకు అధికారిగా మంచి జీతంతో పని చేశారు. ఈ సమయంలో తండ్రి అనారోగ్య బారిన పడటంతో వ్యవసాయాన్ని చూసుకునేం దుకు ఉద్యోగాన్ని వదిలి రమ్మని తండ్రి ఆదేశించడంతో తండ్రి మాటకు కట్టుబడి విదేశం నుంచి సొంత ఊరికి తిరిగి వచ్చారు. ఉద్యోగం విడిచిపెట్టిన బాధ ఒకపక్క ఉన్నప్పటికీ ఉన్న వ్యవసాయ భూమిలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటంలో కీలకంగా వ్యవహరించి వినూత్న పద్ధతుల ద్వారా వివిధ రకాల నూతన పంటలను పండించి విజయాలు సాధించారు. ఈయన జంతు,పక్షి ప్రేమికుడు కావడంతో జంతువులను, పక్షులను ఆదరిస్తూ పెంచుతుంటారు. రాజకీయాలకు దూరంగా ఉండి సొంత గ్రామంలోనే గాక చుట్టుపట్ల ప్రాంతంలో మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్న లక్ష్మణ్ ప్రతాప్ ను ప్రజలు అభిమానంగా చూస్తారు. 2024లో కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీలో చేరి ఈపార్టీ విజయానికి తన వంతు కృషి చేశారు.మంచి వ్యక్తిగా,వ్యవసాయ రంగంలో విజయాలు సాధించిన ఈయనను కే.గోకవరం సహకార వ్యవసాయ పరపతి సంఘం చైర్‌పర్సన్ పదవి వరించింది. తెలుగుదేశం పార్టీలోనే గాక,ఇతర పార్టీలకు చెందిన వారు, రైతులు ఈయనకి చైర్ పర్సన్ పదవి ఇవ్వటాన్ని స్వాగతిస్తున్నారు. ఈ సందర్భంగా ఈయన విశాలాంధ్రతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం,రైతులు తన పట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞుడని పేర్కొన్నారు. సహకార సంఘ పరిధిలో ఉన్న ఆరు గ్రామాలలోని రైతులకు ఆదర్శవంతమైన సేవలు అందిస్తానని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆర్‌జెడి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం రాజమహేంద్రవరం కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు(ఆర్ జె డి) డాక్టర్ పివి కృష్ణాజి ఆకస్మిక తనిఖీ చేసినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి తెలిపారు. కళాశాలలో ఉన్న వివిధ విద్యా,పరిపాలన సంబంధిత ఫైళ్లను తనిఖీ చేసి అన్ని సక్రమంగా ఉన్నాయని ఆర్జెడి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్‌ను అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. కళాశాల వాతావరణం,గార్డెనింగ్ గ్రౌండ్, నిర్వహణ అన్నింటిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపునకు క్విజ్ పోటీలు దోహదం

విశాలాంధ్ర - నరసాపురం : విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించడంలో క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ్ సతీష్ అన్నారు.శ్రీ వైఎన్ కళాశాల ఇంగ్లీష్ క్లబ్, ఆంగ్ల విభాగం, టేలర్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘ సింథసిస్ సంయుక్త ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్విజ్ పోటీలు మంగళవారం ముగిసాయి.ఈ సంద ర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇటువంటి పోటీలతో పోటీ తత్వం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంగ్లీష్ క్లబ్ సమన్వయ కర్త, కమ్యూని కేషన్ స్కిల్స్ ట్రైనర్ ఎం.సారంగపాణి మాట్లాడుతూ ఈ పోటీలు పట్టణ స్థాయిలో వివిధ కళాశాలల మధ్య మూడు రోజుల పాటు అయిదు రౌండ్లలో నిర్వహించామన్నారు. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించి, విద్యార్థలలు కళాశాలల మధ్య సుహృద్భావాన్ని పెంపొందేలా చేయడమే ఈ క్లబ్ లక్ష్యమని అన్నారు. అనంతరం విజేతలైన 'ఎ' టీమ్ సభ్యులు బి. శ్యామ్, టి. దుర్గా మహేష్, పి. ఎం. వి. బాలాజీ, జి. ప్రియాంక, ఎం. నవ్యశ్రీ లకు బహు మతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డీన్ ప్రొఫెసర్ గంధం శ్రీ రామకృష్ణ, మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ రంగినీడి పార్థసారథి, హెచ్ ఆర్ డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్, ఎంసీఏ హెడ్ పిట్టా శ్యాంబాబు, ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ హెడ్ చింతా సోమేశ్వరి, డెల్ స్లీ, హెచ్‌బీ రెహానా బేగం తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

కలెక్టరు కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం పొందుతారని కలెక్టరు కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏలూరులో విద్యార్థినీ విద్యార్థు లకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి నులి పురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మంగళవారం మాత్రలు తీసుకోని వారికి ఈ నెల 18వ తేదీన మాఫ్ ఆఫ్ కార్యక్రమం ద్వారా మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు శారీరక, మానసిక ఎదుగుదలకు అడ్డంకిగా మారిన నులి పురుగులకు నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. పిల్లల కడుపులో నులిపురుగులు చేరి రక్తహీనత, ఆకలి మందగించడం, బరువు తగ్గటం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జె.అమృతం, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఎన్టీఆర్ వైద్య సేవ డిసి డి.రాజీవ్, సర్వ శిక్ష అభియాన్ ఏపిసి డాక్టర్ కె. పంకజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం బృందం నిత్యావసర సరుకుల అందజేత

విశాలాంధ్ర-ముదినేపల్లి : మేము సైతం బృందం నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో పేదలకు, ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తాన్ని అందిస్తోంది. ముదినేపల్లి మండలం లోని పెయ్యేరు గ్రామంలో వైఎస్ఆర్ కాలనీకి రావూరి వెంకట్రావు భార్య

అమ్మాజీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలుసుకున్న బృందం సభ్యులు మొవ్వ ఫణీంద్ర నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం, కొంత ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో దాకరం సర్పంచ్ జాస్తి రాజా, భూపతి రవీంద్ర, పాస్టర్ ఉచ్చుల విజయ్ కుమార్, మద్దా కోటేశ్వరరావు, నాగదాసి విజయ్,బందుల సాగర్, స్పర్జన్ రాజు, బట్టగాని ఏసుదాసు, గంజి ధర్మరాజు, దాసరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 సంవత్సరాల వయసు లోపు బాలురు ,బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక ఈనెల 14న స్థానిక ఏఎస్ఆర్ స్టేడియంలో జరుగుతుందని జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు కే.అలివేలు మంగ,పి ఎస్ ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు. చైనాలో ఈ ఏడాది డిసెంబర్ 4 నుంచి 13 వరకు జరగబోయే ప్రపంచ వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే జాతీయ స్థాయి జట్ల ఎంపికకు రాష్ట్రస్థాయి,జిల్లా స్థాయిలో జట్లను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. జిల్లా,రాష్ట్ర జట్లలో ఎనిమిది మంది బాలురు, 8 మంది బాలికలను ఎంపిక చేస్తారన్నారు. జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు పూణేలోని భలేవాడిలో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ ఎంపికల్లో పాస్పోర్ట్ కలిగి 2010-2011, 2012-2013 సంవత్సరాలలో పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.రాష్ట్ర జట్ల ఎంపిక విజయవాడలోని కేబీసీ జెడ్పి బాలుర పాఠశాలలో ఈనెల 18న నిర్వహిస్తారని జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు అలివేలుమంగ, మల్లేశ్వరరావు తెలిపారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలి ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, ఏలూరు జిల్లా అధికారి జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం నుండి జిల్లా కోర్టు సెంటర్,ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్

కార్యాలయం మీదుగా తిరిగి గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వరకు నిర్వహించారు. ప్రతి ఇంటిపై భారత జాతీయ జండా ఎగురవేయా లనే నినాదాలతో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు,పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది, కార్యనిర్వాహక ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలు ఫీజుల పెంపును అరికట్టాలి

విశాలాంధ్ర - నరసాపురం: పాఠశాలల, కళాశాల ఫీజుల పెంపును ప్రభుత్వం అరికట్టాలని న్యాయవాది, సీపీఐ నాయకుడు నెక్కంటి క్రాంతి కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్స వం సంద ర్భంగా నరసా పురంలో విద్యార్థులు

మంగళవారం నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేసిన ఘనత ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘానికి దక్కుతుందన్నారు.బీసీ, ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల స్కాలర్ షిప్ ల కోసం సంఘం అనేక పోరాటాలు చేసి సాధించిందన్నారు.సంక్షేమ హాస్టళ్లలో సదు పాయాల మెరుగు పరిచి, పేదలందరికీ నాణ్యమైన విద్య అందించాలన్నారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో నాయకులు పవన్,యామిని, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఫాజిల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి సభ్యత్వ నమోదు ద్వారా సేకరించిన ఒక లక్ష రూపాయల డ్రాఫ్టును అందించిన పోడూరు తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ను కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చదలవాడ నాగరాణి అభినందించారు. పోడూరు మండల

తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ మంగళవారం పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో కలెక్టర్‌కు లక్ష రూపాయల డ్రాఫ్ట్ ను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ ఫాజిల్‌ను స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలోని తహసీల్దార్లు కూడా పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు ద్వారా విరాళాల సేకరించి రెడ్‌క్రాస్‌కు అందించాలన్నారు. రెడ్ క్రాస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం వలన జిల్లా గర్వించే విధంగా ఇప్పటికే గోల్డ్ మెడల్ సాధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఈవో ఇ.నారాయణ, సమగ్ర విద్య ఎపిసి పి. శ్యాంసుందర్, తదితరులు ఉన్నారు.

ఆల్బండ్‌జోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : నులిపురుగుల నివారణకు తప్పనిసరిగా చిన్నారులకు ఆల్బండ్జోల్ మాత్రలు మింగించాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ జె.సురేష్ తెలిపారు. బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని వేదాంతపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు ఆల్బండ్ జోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల విద్యార్థుల్లో రక్తహీనత, తరచూ కడుపునొప్పి, నీరసంగా ఉండి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం

చూపుతాయన్నారు. వాటిని నిర్మూలించడానికి అందరికీ మాత్రలు మింగించాలని పేర్కొన్నారు. వైద్య అధికారి వి. సత్యనారాయణ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత లోపం కాయకూరలు, ఆకుకూరలు, శుభ్రంగా నీటిలో కడగకుండా వండిన ఆహార వలన నులిపురుగుల గుడ్లు ప్రేగుల్లో పరాన్న జీవులుగా ఉంటూ పిల్లల ఆరోగ్యాన్ని క్షీణింప చేస్తాయని తెలిపారు. సంవత్సరానికి రెండు సార్లు ఆల్బండ్ జోల్ మాత్రలు మింగించాలని ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. సరిపల్లి ఎంపీపీ పాఠశాలలో వైద్య అధికారి గీతా రాణి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు బివి నారాయణ, ఏఎన్ఎం మణికుమార్, ఎం ఎల్ హెచ్ పి ఎస్ వినోద్ కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-నూజివీడు: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న జీతాలు, పిఎఫ్ లు తక్షణం విడుదల చేయాలని ఏఐటియుసి నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్) వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, పిఎఫ్‌లు శానిటేషన్ కార్మికులు అకౌంట్లో రెగ్యులర్‌గా జమ చేయాలని కోరుతూ నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వీరికి జీతాలు పెంచాలన్నారు. దీనితోపాటు పిఎఫ్‌లు అసలు జమ చేస్తున్నారో లేదో కూడా తెలియడం లేదని అన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం స్పందించి కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్ లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్,ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని,

సంవత్సరానికి 2జతలు యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు సమస్యలు సంబంధించిన అన్ని వెంటనే క్లియర్ చేయాలని, హాస్పటల్ శానిటేషన్ కు సంబంధించి శుభ్రపరచడానికి కావలసిన మెటీరియల్ రెగ్యులర్ గా సరఫరా చేయడం లేదన్నారు.పాత,కొత్త ఆసుపత్రి భవనాలు శానిటేషన్ చేయడానికి వర్కర్స్ ను కూడా పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ శానిటేషన్ కార్మికులు వై పద్మ,రమాదేవి, మణి, సత్యవతి, రషీద,సుందరి, సుమలత, అజయ్,సిమోను, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు ఏడేళ్ల జైలుశిక్ష

విశాలాంధ్ర-లింగపాలెం: భర్త పెట్టే కట్నం వేధింపులకు తాళలేక చల్లగొల్ల శిరీష మృతికి కారకుడైన భర్త చల్లగొల్ల రాంబాబుకు జిల్లా ఐదవ అడిషనల్ న్యాయమూర్తి మురళీకృష్ణ ఏడేళ్లు జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. కలరాయనగూడెనికి చెందిన చల్లగొల్ల రాంబాబుకు చల్ల చింతలపూడికి చెందిన శిరీషతో 2004లో వివాహమైంది. వివాహం జరిగిన నాటి నుంచి భర్త కట్నం కోసం వేధిస్తూ ఉండేవాడని, వేధింపులు తాళలేక 2007 జూలైలో ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును డీఎస్పీ రవిచంద్ర దర్యాప్తు చేశారు. కేసుకు సంబంధించి కోర్టు కానిస్టేబుల్ టి.రవి పూర్తిస్థాయిలో సహకారం అందించారు. ఈయనతో పాటు సిఐ క్రాంతి కుమార్,ఎస్ఐ వెంకన్నబాబు కీలకంగా వ్యవహరించారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి ముద్దాయికి శిక్ష విధించారు. ఈకేసుకు సంబంధించి పోలీసులు అందించిన సహకారాన్ని ప్రజలు అభినందిస్తున్నారు.

వేల్పుచర్లలో డోర్ టు డోర్ చెత్త సేకరణ

విశాలాంధ్ర- ముసునూరు: ప్రజలు చెత్తను ఇళ్ల పరిసర ప్రాంతాల్లో వేయరాదని, ఇంటింటికి చెత్త సేకరణ కోసం వస్తున్న వాహనాల్లో మాత్రమే చెత్త వెయ్యాలని డీపీవో కె. అనురాధ అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమం అమలు తీరును ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా డిపిఓ గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. చెత్తను చెత్త సమీకరించే వాహనాల్లో వేయడం ద్వారా దానిని స్థానికంగా ఉన్న ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ల లో ఏర్పాటు చేసిన తొట్టెలలో తడి చెత్త,పొడి చెత్త గా వేరు చేసి, తిరిగి మరల రైతులకు కంపోస్ట్‌ఎరువుగా తయారుచేసి తక్కువ ధరకు అందించడం జరుగుతుందని, తద్వారా పంచాయితీలకు నిధులు సమకూరడం తో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఆమె వేల్పుచర్ల చెత్త సమీకరణ కేంద్రం నిర్వహణ పని తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మండల అభివృద్ధి అధికారి బసవరాజు అచ్యుత సత్యనారాయణ రాజు, గ్రామ సెక్రెటరీ శ్రీనివాస, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పు

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కాగుపాడు గ్రామ కాపురస్తు **KORADA YASWANTH SIMHA PRATAP** అని నమోదు కాబడినది. నా పేరును న్యూమరాలజీ ప్రకారం **KORADA YASWANTH SIMHA PRATHAP** గా మార్చవలెను.

కోరాడ యశ్వంత్ సింహ ప్రతాప్
S/o వెంకట రామారావు
కాగుపాడు, ఉంగుటూరు మండలం,
ఏలూరు జిల్లా.

నులిపురుగులను నివారించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: పిల్లలు, విద్యార్థులు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకొని రక్తహీనతకు దూరం కావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

సందర్భంగా చినఅమిరం జిల్లా పరిషత్ హైస్కూల్లో కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు స్వయంగా నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగులు ప్రమాదకరమని వీటివల్ల రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. నులిపురుగుల నియంత్రణ చాలా కీలకమైన అంశం అన్నారు. ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సులోపు పిల్లలందరూ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. 19 సంవత్సరాలలోపు పిల్లలు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఈ మాత్రలను 1 - 5 సంవత్సరాల్లోపు గల పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో, 6 - 19 వయసు గల పిల్లలకు, కిశోర బాలలకు పాఠశాలలు, కళాశాలలో అందజేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న పిల్లలందరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డి.ఎం.అండ్.హెచ్.ఓ డాక్టర్ జి.గీతాబాయి, డీఈవో ఇ.నారాయణ, ఆర్.బి.ఎస్.కే స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత మృతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉరి వేసుకుని వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలో బయ్యనగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రంపేట గ్రామానికి చెందిన సంగనం పరిమళ (23) భర్త శ్రీరాములు, పరిమళ ఎర్రంపేట గ్రామంలో పనులు లేకపోవడంతో, ఆరు నెలల క్రితం బయ్యనగూడెం గ్రామానికి కుటుంబ సమేతంగా వచ్చి ఇల్లు అద్దెకి తీసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఒక రైతు పొలంలోకి కూరగాయలు కోయడానికి మేస్త్రి ద్వారా రోజుకు 200 రూపాయలు కూలికి వెళుతోంది. రోజువారి జీతం 200 రూపాయలు సరిపోక పోవడంతో మేస్త్రిని 300 రూపాయలు జీతం ఇవ్వాలని అడగడంతో, ఆమె నిరాకరించింది. తరువాత పరిమళ రైతుని 300 రూపాయలు కూలి ఇవ్వాలని అడిగినదని, అంతట మేస్త్రి 200 రూపాయలు కూలి ఇస్తాను ఇష్టమైతే రా లేకపోతే మానెయ్యి అని చెప్పడంతో, తన భర్త శ్రీరాములుకు జరిగిన విషయాన్ని పరిమళ తెలియజేసింది. నీకు ఇష్టమైతే పనికి వెళ్ళు లేకపోతే మానెయ్యి అని చెప్పగా, మనస్తాపానికి గురైన పరిమళ తన ఇంటి దూలానికి చీరతో ఉరి వేసుకోవడంతో ఆమెను కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

రంగనాథన్ జయంతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులలో షియాలి రామామృత రంగనాథన్ ఒకరు అని గ్రంథ పాలకురాలు యు. రాముడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాల యంలో వర్గీకరణ శాస్త్ర పితామహుడు షియాలి రామామృత రంగనాథన్ 133వ జయంతిని నిర్వహించారు.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి

నివాళులు అర్పించారు. ఈయన పుట్టినరోజున భారతదేశం జాతీయ గ్రంథాలయ దినోత్సవం (గ్రంథ పాలకుల దినోత్సవం) గా ప్రకటించిందని రాముడు తెలిపారు. ఈ కార్యక్రమంలో చదువరులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరపట్ల రాజుకు మద్రాస్ యూనివర్సిటీ డాక్టరేట్

విశాలాంధ్ర– కొవ్వూరు: ఉభయగోదావరి జిల్లాలో ఉన్న క్రైస్తవ సంఘాలు వాటి చరిత్ర సామాజిక సేవ, సాహితీ సేవ వంటి అంశాలను ప్రధానంగా తీసుకొని "ఉభయ గోదావరి జిల్లాలోని ప్రముఖ క్రైస్తవ సంఘాల సాహిత్య సామాజిక సేవలు" అనే అంశంపై మద్రాసు క్రైస్తవ కళాశాల భాషా విభాగాల అధిపతి ఆచార్య శ్రీపురం యజ్ఞ శేఖర్ పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి మద్రాసు విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీ ని అందించిందని పరిశోధన చేసిన మరపట్ల రాజు తెలియ జేశారు. వారిచే ప్రచురించిన సాహిత్యం, వారు సమాజానికి చేసిన సేవ, మత విధానాలు, ఆరాధన పద్ధతులు వంటి వాటిపై పరిశోధన చేసినట్లు తెలియ జేశారు. మరపట్లరాజు ఈ సందర్భంగా తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియ ల్లో గేయాలు, నాటికలు, నాటకాలు, వచన కవిత్వం, పద్య కవిత్వం, నవలలు, చారిత్రక కావ్యాలు, భక్తుల జీవిత చరిత్రలు వంటి అంశాలపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి మద్రాసు విశ్వవిద్యాలయం పి హెచ్ డి డిగ్రీ ప్రకటించిందని తెలియజేశారు. ఈ పరిశోధనలో సూచనలు సలహాలు ఇచ్చి సాహిత్య పరంగానూ, ఆర్థికంగానూ సహకరించిన గురువర్యులు నన్నయ విశ్వ విద్యాలయ తెలుగు శాఖ సహాయ చార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధిపతి అయిన ఆచార్య విస్తాలి శంకర రావు కందుకూరి వీరే శలింగం ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ సంజీవరావు కన్నడ శాఖ సహాయ చార్యులు డా.ఎ. మునిరాజా అభినందనలు తెలియజేశారు

ప్రజారోగ్యం, నగర పరిశుభ్రతే ధ్యేయం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజల ఆరోగ్యం తమ ధ్యేయమని, అలాగే నగర శుభ్రత మనందరి బాధ్యత అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. మంగళవారం ఉదయం ఆయన 39వ డివిజన్‌లో రాజమండ్రి పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు యాళ్ల ప్రదీప్, జనసేన పార్టీ రాజమండ్రి సిటీ అధ్యక్షులు వై శ్రీను తదితరులతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. సదరు డివిజన్‌లో శానిటేషన్ ఏ విధంగా చేస్తున్నారో పరిశీలించారు. డివిజన్‌లోని మస్తర్ల కార్యాలయానికి వెళ్లి అన్ని రికార్డులను పరిశీలించారు. సదరు డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. డ్రైనేజీల్లో పేరుకుపోతున్న సిల్టును ఎప్పటికప్పుడు తొలగించి మురుగునీరు సక్రమంగా పారేలా చూడాలన్నారు. డివిజన్లో నిత్యం పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, రికార్డులను సక్రమంగా రాయాలంటూ సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామంటూ శానిటరి ఇన్స్పెక్టర్, సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : పర్యావరణాన్ని పరిరక్షిం చేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దేవరపల్లి లైన్స్‌క్లబ్ అధ్యక్షురాలు పెందుర్తి రామరత అన్నారు. దేవరపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పెందుర్తి రామరహిత ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాష్యం, చైతన్య, హైస్కూల్ , ఎంపిపి స్కూల్స్‌లో మొక్కలు వేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మెంబెర్స్ లయన్ వెంకన్న బాబు, ఎన్ లలిత లయన్స్ క్లబ్ తరుపున అధ్యక్షులు వెంకట్, సెక్రెటరీ పికాప్య శ్రీనిత్య, కోశాధికారినాగ చైతన్య భాష్యం ప్రిన్సిపాల్ , పి పేరయ్య నాయుడు చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ వినూత్న, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, విద్యార్థిని విద్యా ర్థులు పాల్గొన్నారు. నూతనంగా జాయిన్ అయిన జాస్తిసతీష్ విరివిరిగా మొక్కలు నాటారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల వైద్య అధికారులు డాక్టర్ చైతన్య, డాక్టర్ యేసు రాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. దీనిలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, విద్యార్థులకు మాత్ర లను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మొత్తం మండల వ్యాప్తంగా 11167 మందికి ఈ మాత్రలను వేశారని అన్నారు.

విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

- విద్యకు కేంద్ర బడ్జెట్‌లో 6%, రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలి
- ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాజమండ్రి నగరంలో ఎస్ కే విటి జూనియర్ కాలేజ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల పూడి సునీల్ ముందుగా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్రం మా జన్మ హక్కు అంటూ బ్రిటిష్ పాల కులను తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. ఆగస్టు 12 1936 లో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వ విద్యాలయంలో ఆవిర్భవించిందని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాట నిర్వహించి నేటికీ 90 సంవత్సరాలు కావస్తుందని వారు తెలియజేశారు భగత్ సింగ్, రాజు గురు, సుకుదేవ్ , వారసత్వాన్ని పుణికిపుచ్చు కున్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ తెలియ జేశారు. విద్యా ప్రవేటీ కరణ కార్పొ రేటీ కర్ణ వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్లో 6% నిధులు రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ సురేష్, గోపి మోహన్, కృష్ణ, ఈ సౌమ్య, ఎన్ ప్రసన్న, టి భావన ఆర్ అశ్విన్ , మ్ కిషోర్ , జి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : రాజకీయాల్లో ఉండాతనంగా మాట్లాడాలని వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని దేవరపల్లి మండల వైసిపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ ఎంపీపీ కేవీకేదుర్గారావు పేర్కొన్నారు. ఎర్నగూడెంలో సోమవారం వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల పరిపాలనలో గ్రామ సచివాలయాలు నవరత్నాలు ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిగాయని, దేశం నేతలు సంవత్సర పరిపాలన లో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే చెప్పుకోవటం మాని ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గడ జగదీష్ నరహరిశెట్టిరాజేంద్ర బాబు కుసులూరి సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు సంతోషంగా లేరన్నారైతు భరోసా నిధులు కేవలం కొంత మందికే పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా వైసిపీ నేతలుపై విమర్శలు దేశం నేతలు తీరును ఆక్షేపించారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు గన్నమనే జనార్ధన రావు దొనెల్లి జానకి రామ్ సత్తి జగదీశ్వర్రెడ్డి సత్తి సాయి ఈశ్వర్ రెడ్డి సాది సుబ్బా రావు బొంత భరత్ నరహరిశెట్టి సుధాకర్ పుట్ట వెంకటస్వామి గుత్తుకొండ అచ్యుత రావు మేడి బోయిన గంగరాజు కదలి హైమావతి పాల్గొన్నారు

జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : తూర్పు గోదావరి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సర్వ సభ్య సమావేశం స్థానిక కందుకూరి వీరేశలింగం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వీరబాబు, కోశాధికారిగా జై కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఏలూరు జిల్లా నుంచి వచ్చిన సాయి శ్రీనివాస్, ఇందుకూరి రమేష్ రాజు ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల నుండి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎంపికైన వారికి పలువురు ప్రముఖులు, హెడ్మాస్టర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శు లు, యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు,ఎస్ టి యు పి ఆర్ టి యు అధ్యక్ష, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

నీటి వనరుల గణనపై వీఆర్‌ఓలకు శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం : చిన్న తరహా నీటి వనరుల పై వీఆర్ఓలకు శిక్షణ జరిగింది. మండలం లోని రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీతానగరం, కోరుకొండ ఏఎస్ఓలు స్వాతి, భగవాన్ దాస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనిలో చిన్న తరహా నీటి వనరుల ఏడవది, నీటి వనరుల గణన రెండవ దానిపై గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇచ్చారు. మండల వ్యాప్తంగా ఆరవ చిన్న తరహా నీటి వనరుల 1131 ఉన్నాయి అని అన్నారు. అది, కారులు వీటి గణనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. అలాగే ఈ గణనను సాధ్యమైన అంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ తహసిల్దార్ సునీత, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం

విశాలాంధ్ర - తాళ్లపూడి : నులిపురుగుల కారణంగా పిల్లలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగించేందుకు ఏటా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా టాబ్లెట్స్ అందిస్తున్నట్లు కొవ్వూరు డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖధికారి జె.సంధ్య పేర్కొన్నారు. మలకపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వైద్యాధికారి డా.పి. అన్నపూర్ణ ఆధ్వర్యంలో పిల్లలకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతు మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలలోని 98 శాతం పిల్లలకు మాత్రలు వేశామని, ఈ నెల 20 వ తేదీన జరిగే మాప్ అప్ రౌండ్ లో వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించే నిమిత్తం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటింగ్ అధికారి శ్రీకాంత్ మండలాన్ని సందర్శించారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్‌కు నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు స్కూల్ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్ గా చింతా జోగినాయుడు, డైరెక్టర్లుగా కర్రి గాయత్రి, మారిశెట్టి శ్యామ్ కుమార్, చొక్కకుల రమణి కుమారి, అడపా శివ కుమార్, పొట్నూరి సత్య నారాయణ, కోళ్ల శ్రీనివాసరావు, దోమాడ భాగ్యలత, పాలేపు సాయి రమణి కుమారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి గౌరవం దక్కుతుందన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్‌ని ఉన్నత పాఠశాలగా మార్చామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకంతో మరెన్నో సేవలు

- డ్రైవర్లు, కండక్టర్లు నిబద్ధతతో పనిచేయాలి
- ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ -2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విజయరత్నం



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న స్త్రీ శక్తి పథకంతో తమ శాఖ ప్రజలకు మరెన్నో సేవలు అందించే సువర్ణ అవకాశం లభించిందని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ -2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విజయరత్నం అన్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ డిపోను మంగళవారం సందర్శించారు. దీంతో తూర్పు గోదావరి జిల్లా రవాణా అధికారి యేలూరి సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన స్త్రీ శక్తి పథకం పై సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలు పై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విజయరత్నం దిశ నిర్దేశం చేశారు.తొలుత ఆర్టీసీ ప్రాంగణంలో వివిధ శాఖలైన బస్ స్టేషన్, ఎర్నింగ్ సెక్షన్, గ్యారేజ్‌లోని విభాగాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న "స్త్రీ శక్తి పథకం" గురించి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు కండక్టర్లు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. గ్యారేజ్ సిబ్బంది కండిషన్లో గల బస్సులను ఇవ్వ వలసిందిగా ఆదేశించారు. ఈ పథకం ద్వారా మనం ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ,వివిధ విభాగాల సూపర్‌వైజర్లు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రంగ నాథన్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - పెద్దాపురం : పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకుల దినోత్సవంను పురస్కరించుకుని భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు గ్రంథ పాలకులు గ్రంథాలయ శాస్త్ర పితామహులు పద్మశ్రీ డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ 133వ జయంతిని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ శ్రేణి గ్రంథ పాల కులు పాలంకి నాగరాజు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, చిరంజీవి, కే దుర్గాప్రసాద్, జి శివకృష్ణ, వి సుధీర్ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

- మూసుకుపోయిన డ్రైనేజీ తూము
- రోడ్లు బురదమయం

విశాలాంధ్ర - కరప : వర్షం పడితే చాలు రోడ్లు బురదమయం, డ్రైనేజీలు తూములు మూసుకుపోయి నీరు పోయే మార్గం లేక రోడ్లపైకి పొంగి దుర్గంధం వెదజల్లుతూ వీధులు కంపు కొడుతున్నాయి. మార్గం చూపండి, అంటున్న గ్రామ నివాసులు గగ్గోలు పెడుతున్నారు. కరపగ్రామం నక్కా వారిపేట, సీతమ్మపేట, పేపకాయలపాలెం రోడ్డు, ఇలా ఏవీధికి వెళ్ళిన రోడ్లపైకి డ్రైన్‌లోని బురద నీరు వచ్చి చేరడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోతే దోమలు పెరిగి సీజ నల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గ్రామాలలో జ్వరాలు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. నక్కవారి పేటలో స్కూల్ వద్ద కల్వర్టు కట్టకపోవడంతో నీరు పోయే పైపులైన్ మూసుకుపోవడంతో నీరు వీధుల్లోకి చేరింది. దీంతో నడిచి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. డ్రైనేజీ వాటర్ కావడంతో ఆ నీటిలో నడవడం వలన అనేక అంటు రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు. ఈ సమస్యపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి అంటు రోగాలు ప్రబలకుండా డ్రైనేజీలు పూడికలు తీయించి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు. ముఖ్యంగా కల్వర్టు నిర్మాణాలు త్వరితగతిని చేసి నీరు పోయే మార్గాన్ని చూపించాలని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో గ్రంథపాలకుల దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 12వ తేదీన అంతర్జాతీయ యువజన దినోత్సవం, గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాస రెడ్డి తొలుత గ్రంథాలయ పితామహుడు, ఆధునిక గ్రంథాలయ రూపకర్త ఎస్ఆర్ రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రంగనాథ్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, ప్యానల్ డిస్కషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికీ ధ్రువ పత్రాలను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రో ఎంవి శ్రీనివాస్, వైస్ ప్రో వైస్ ఛాన్సలర్స్ డా ఎస్ రమాశ్రీ, డా ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డా జి సురేష్, డీన్ ప్రో వి సత్యనారాయణ, వివిధ విభాగాల డీన్లు, గ్రంథాలయ విభాగాధిపతి కె అశోక్ కుమార్ మరియు గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్రగడ త్వరగా కోలుకోవాలని మహిళలు పూజలు

విశాలాంధ్ర - రౌతులపూడి : కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో మాజీ మంత్రి వైసిపి పిఏసి సభ్యులు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని వైసిపి నాయకులు పూజలు నిర్వహించారు. అదే గ్రామంలో గ్రామ దేవత ముసలమ్మ తల్లికి మహి ళలు భక్తి శ్రద్ధలతో లలిత పారాయణం చేసి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుణ్యమంతుల లోవదొర, సుంకర రామచంద్రరావు, రౌతు మూల వెంకట రమణ, దాసరి సూర్యనారాయణ, బందారు బైరాగి, తంటపురెడ్డి జయలక్ష్మి, ఇజ్జపు నందిని, ఇజ్జపు మంజు, ఇజ్జపు చిన్నారి, తంటపు రెడ్డి జయశ్రీ, గొర్లి పాపయమ్మ, సుంకర ఉమా, కేసంశెట్టి పద్మ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కళ్యాణ మండపం వాచ్‌మేన్ భార్య ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ బాలా చెరువు కూడలి వద్ద ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపానికి చెందిన వాచ్మెన్ భార్య మేనేజర్‌గా పనిచేస్తున్న ఎన్ఎస్ఎన్ రాజు వేధింపులు తాళలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే మండపంలో వాచ్మెన్‌గా చేస్తున్న కుశ్వంత్ తన భార్య అరుణను హుటాహుటిన సామాన్య ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి 100కి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి సిబ్బంది స్పందించి ఆమెకు మెరుగైన వైద్యం అందించడంతో ప్రమాదం నుండి కొంత ఉపశమనం పొందింది. ఈ విషయంపై భర్త కుష్వంత్‌ను వివరం అడగక తాను భార్య టిటిడి కళ్యాణ మండపంలో ఒకరు వాచ్మెన్ గాను తను భార్య స్వీపర్గాను విధులు నిర్వహిస్తున్నామని ఈ మధ్యకాలంలో వచ్చిన మేనేజర్ రాజు చిటికి మాటికి దుర్భాషలాడుతూ తమను వేధించడమే కాకుండా తాను లేనప్పుడు తన భార్యను దూషించడంతో ఆమె మనస్థాపంతో ఈ ఆత్మహత్య ప్రయత్నం చేసిందని దీనిపై అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నులి పురుగుల నివారణకు మందులు పంపిణీ

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : విద్యార్థులకు నులి పురుగు నివారణకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు మంగళవారం మందులు పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగులు దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కొమరగిరి డాక్టర్ జి రాజ్ కుమార్ 14 ప్రభుత్వ, రెండు ప్రైవేటు అంగన్వాడి పాఠశాల విద్యార్థులకు సుమారు 1739 పిల్లలకు ఆశ కార్యకర్తల ద్వారా మందులు పంపిణీ చేసినట్టు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ జి రాంబాబు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్-2025కు ఎంపీసానా మద్దతు

విశాలాంధ్ర - కాకినాడ : రాజ్యసభలో నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్ - 2025పై మాట్లా డిన ఎంపీ సానా సతీష్ బాబు, ఈ బిల్లుకు తమ పార్టీ తెలుగు దేశం పార్టీ తరపున, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరపున మద్దతు ప్రకటించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం 2024-29 క్రీడా విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ సానా సతీష్ బాబు మాట్లా డుతూ, తాను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉన్న క్రీడాకారుడిగా, నిజమైన ఛాంపియన్లు గ్రామీణ స్థాయిలో తయారవుతారని, ఈ బిల్లు గ్రామాల నుంచి ప్రతి భను వెలికితీసి, న్యాయమైన పాలనతో, క్రీడాకారుల శ్రేయస్సు తో కూడిన పూర్తి వ్యవస్థను నిర్మించడంలో పెద్ద అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ బిల్లులో తొలిసారిగా సేఫ్ స్పోర్ట్స్ రూల్స్, వేగ వంతమైన గ్రీవెన్స్ సిస్టమ్స్, న్యాయమైన సెలక్షన్ విధానం వంటి క్రీడాకారుల రక్షణ చర్యలు కేంద్రంలో ఉంచబడ్డాయని తెలిపారు. అంతేకాక, నేషనల్ స్పోర్ట్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం ద్వారా వివాదాలను ప్రపంచ ప్రసిద్ధ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ తరహాలో వేగంగా న్యాయంగా పరిష్క రించే అవకాశం ఉంటుందని చెప్పారు. పాలక మండళ్లలో వయస్సు పరిమితి 25 నుండి 7 బిల్లు లోని క్లాజ్ 30 ప్రకారం అంతర్జాతీయ ఉత్తమ పద్ధ తులను కేంద్ర ప్రభుత్వం స్వీకరించే అధికారం ఉం దని, ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రోడ్‌మ్యాప్‌తో అనుసంధానమై జాతీయ ఈవెంట్ల నిర్వహణ, గ్రామీణ సదుపా యాల అభి వృద్ధి, ఆటగాళ్ల శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్, డేటా అనలిటిక్స్ వినియోగానికి దోహ దం చేస్తుందని తెలిపారు. తన మాతృసంస్థ బీసీసీఐ క్రీడా పాలన, నిర్వహణలో అత్యుత్తమ మోడల్‌గా నిలిచిందని, 2019 నుండి ప్రొఫెషనలిజం గ్లోబల్ గౌరవంలో గణనీయమైన వృద్ధి సాధించిందని చెప్పారు. 2028లో క్రికెట్ మళ్లీ ఒలింపిక్స్‌లో ప్రవేశించనుండగా, 2036 సమ్మర్ ఒలింపిక్స్‌ను భారత్ ఆతిథ్యం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ సందర్భంలో, ఈ బిల్లు భారత క్రీడా పాలనను ప్రపంచ వేదికకు సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు.

దివిలిలో తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర - పెద్దాపురం : బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే హర్ ఘర్ తిరంగ ర్యాలీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం మండలం అధ్యక్షులు పోతుల వీర ప్రభాకర్ రావు అధ్యక్షతన, విశ్వకవి విద్యా సంస్థలు ఆధ్వర్యంలో చంద్రమాంపల్లి నుంచి దివి గ్రామం వరకు ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమ ఇన్చార్జ్ గోరకపూడి చిన్నియ్య దొరగారు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రేగులబంద మంగరాజు, సకుమళ్ళ రాజేశ్వరరావు, యానాల రాంబాబు, అడబాల సూరిబాబు, ఆరుమిల్లి గోపి, కోతాబత్తుల నగేష్, పలని బాలాజీ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీ వారసత్వ ప్రదేశాలు,ప్రార్థనా స్థలాల పరిరక్షణకు నిధులు కేటాయింపు

విశాలాంధ్ర - కాకినాడ : దేశంలో మైనార్టీ వారసత్వ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలతో పాటు తీర్థయాత్ర కేంద్రాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వీటి కోసం రాష్ట్రాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పష్టం చేశారు. మైనార్టీ వారసత్వ ప్రదేశాలు, ప్రార్థనా స్థలాలు, తీర్థయాత్ర కేంద్రాల పరిరక్షణకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు, రాష్ట్రాలకు కేటాయిస్తున్న నిధులపై మంగళవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి షెకావత్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో ఆర్కియా లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో 3,685 కేంద్రీయ పరిరక్షిత స్మారక చిహ్నాలు ఉన్నాయని, వీటిలో మైనారిటీ వారసత్వ ప్రదేశాలు కూడా ఉన్నాయని తెలిపారు. వీటి పరిరక్షణకు జాతీయ పరిరక్షణ విధానం-2014 ప్రకారం రాష్ట్రాలకు క్రమం తప్ప కుండా కేంద్రం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి సర్కిల్‌కు గడిచిన 2020-21లో రూ.4.57 కోట్లు నిధులు కేటాయించగా, 2024-25లో రూ. 6.50 కోట్లు కేటాయించిందని తెలిపారు. దీంతోపాటు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కేం ద్రం ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

యు కొత్తపల్లిలో భారీ వర్షం

విశాలాంధ్ర-యు కొత్తపల్లి : ఎండ, ఉక్కపోతతో సతమాతమవుతున్న ప్రజలు మంగళవారం సాయంత్రం వాతావరణం మార్పు చెంది భారీ వర్షం కురవడంతో మండల ప్రజలు ఒక్కసారిగా సేద తీరారు. గడిచిన కొన్ని రోజుల నుండి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండి ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు అనేకమంది ఇంటి నుండి బయటకు రాకుండా ఏసీ గదుల్లోనే ఉన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఒక్కసారిగా వాతావరణం మార్పు చెంది వర్షం రావడంతో మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పుష్కరాల సన్నద్ధతపై అధికారులతో సమీక్ష

విశాలాంధ్ర - కొత్తపేట : రానున్న గోదావరి పుష్కరాల సన్నద్ధతపై మంగళవారం వాడపాలెం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కార్యాలయం వద్ద జిల్లా దేవాదాయ అధికారి సత్యనారాయణ, డీఈ ఉదయ్ కుమార్, నియోజకవర్గంలో ఉన్న వివిధ దేవాలయాల కార్యనిర్వహణాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాలయాల పునర్నిర్మాణం, మరమ్మతులు, పెయింటింగ్, ఆధునీకరణ, ఆలయాల్లో సౌకర్యాలు కల్పన మొదలైన అంశాలపై చర్చించారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4

విశాలాంధ్ర - కొత్తపేట : పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పీ4 కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు రూపొందించారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. అన్నారు. మంగళవారం వాడపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై నియోజకవర్గ ప్రత్యేక అధికారి బివి రమణ, డీఎల్డీవో ఎస్టీవి రాజేశ్వరరావు, నాలుగు మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీ4 జీరో పావర్టీ ద్వారా పేదరికం నిర్మూలించే లక్ష్యంతో "బంగారు కుటుంబాలు పీ4 పోర్టల్ ద్వారా ఎంపిక చేయడానికి దత్తత ప్రక్రియ"పై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పేదరికం లేని రాష్ట్రాన్ని సాకారం చేయడమే విజన్ 2047-పీ4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, అందుకు అందరూ మద్దతు తెలపాలని ఎమ్మెల్యే అన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల స్థూపానికి ఘననివాళులు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' వారోత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ సూచనలతో ఆత్రేయపురం మండలం వాడపల్లిలో స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులు అర్పించారు. మండల అధ్యక్షుడు యు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం వద్ద శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు పడాల నాగేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ అల్లు భాస్కరరావు, యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, ఓబీసీ మోర్చ కన్వీనర్ గూడవల్లి రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సిస్ట కుటుంబరావు, మండల ప్రధాన కార్యదర్శి తాడాల సుబ్రహ్మణ్యం, సహకార బ్యాంక్ బోర్డు డైరెక్టర్ కామేశ్వర శాస్త్రి, స్థానిక నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అర్ధ ఏకాహం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి క్షేత్రపాలకుడైన వేణుగోపాలస్వామి ఆలయంలో నాగభూషణం సంకీర్తన భజన సమాజం ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం ర్యాలికి చెందిన చెందిన సుమారు 30 మంది భజన కళాకారులచే అత్యంత భక్తి శ్రద్ధలతో ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అర్ధ ఏకాహం నిర్వహించారు. కార్యక్రమంలో ఉండపల్లి నాగభూషణం, ధనుంజయరాజు, భరతరాజు, గోవిందు, వెంకటేశ్వర్లు, వెంకన్న, గెడ్డ వెంకట్రావు, భరత్ రాజు, పోలయ్య, కిట్టారావ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- రూ.50లక్షలతో నిర్మించనున్న బిపిహెచ్‌కు శంకుస్థాపన
- మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర - రాజానగరం : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకురావడమే ఎన్డిఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ౹౹ వైద్య విద్యా శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ అన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రాజానగరంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మంగళవారం జరిగిన 15వ ఆర్థిక సం ఘం నిధులు నుండి రూ50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవ నం (బిపిహెచ్) శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా విచ్చే సిన మంత్రి తొలుత నూతన భవన నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు తీసుకువచ్చేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసం ధానంగా బిపిహెచ్చు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాజానగరంలో 50 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న బిపిహెచ్ కి భూమి పూజ చేయడం జరిగిందని, వీటిని ఏడాది కాలంలో పూర్తి చేస్తామని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాకు 19 బిపిహెచ్చు మంజూరు చేయగా నియోజక వర్గాల్లో చెరో మూడు బిపిహెచ్చు మంజూరు చేశామన్నారు. కూటమి అయితే వీటికి చాలా చోట్ల భవన నిర్మాణం లేకపోవ డంతో ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఎన్డిఏ కూటమి కోరిక మేరకు కేంద్ర ప్రభుత్వం 3500 విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మా ణాల కోసం15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించడం జరిగింద న్నారు. త్వరలో వీటిని పూర్తి చేసి వైద్య సిబ్బంది ద్వారా ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యన్ని అందించే దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి బిపిహెచ్ నందు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వ హించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలన ప్రతి ఒకరికి బాధ్యత అంటూ అందుకు సంబంధించిన గోడ పత్రికలను మంత్రి విడుదల చేశారు. అలాగే బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన తిరంగా ర్యాలీను ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, అనపర్తి రైల్వే అడ్వైజరీ బోర్డు సభ్యులు బొమ్ముల సతీష్, రీజనల్ డైరెక్టర్ మెడికల్ మరియు హెల్త్ అధికారి పద్మ శశిధర్, డిఎంహెచ్వో కె.వెంకటేశ్వరరావు, డిఐవో డాక్టర్ పి.కోమలి, డిప్యూటీ డిఎం హెచ్వో డాక్టర్ వసుధార, ఎంపిడివో ఝాన్సీరాణి, తహసిల్దార్ జి.అనంత లక్ష్మీ సత్యవతి దేవి, పిహెచ్సి వైద్యులు డాక్టర్ రామ్ భాస్కర్, డాక్టర్ వెంకటలక్ష్మీ, డాక్టర్ ఉదయ్ ఏంజెల్ పాల్గొన్నారు.

గోపాలపురం సొసైటీ అధ్యక్షులుగా వడ్లమూడి రమేష్ బాబు

విశాలాంధ్ర - గోపాలపురం : పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన ప్రతి నాయకుడిని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తిస్తారని వాదాల కుంట గ్రామ టిడిపి కార్యకర్తలు తమ హర్షా న్ని వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా గత ఎన్నికలలో మం డలం లోని అన్ని గ్రామాల కంటే అత్యధిక మెజారిటీ 726 ఓట్ల మెజా రిటీ మద్దిపాటి వెంకట రాజు అందించిన గొప్ప నాయకుడు వడ్ల మూడి రమేష్ బాబు అని ఆయన అభిమానులు ఆయనను కొని యాడారు. ఇందులో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధినేత ముఖ్యమంత్రి ప్రకటించిన సొసైటీ అధ్యక్షులు నియామకంలో తమ నాయకుడు వడ్లమూడి రమేష్ బాబుకు అధి కారాన్ని అప్పగించినందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి విద్యా శాఖ మంత్రి యువ నాయ కుడు నారా లోకేష్ బాబుకి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకి ఈ పదవికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా యువత కొడమం చిలి సోమరాజు, సత్య నారాయణ బెల్లపు సురేంద్ర, ఖండవల్లి రవి శేఖర్, రాపాక విక్రం, బుచ్చిరాజు, కొడమంచిలి ప్రసాద్, యువత పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, రాజమండ్రి

E.P.No.19/2018
IN O.S.No. 132/2004

Between :
ముద్దె నాగేశ్వరరావు - DHR
మరియు
అల్లాడ శ్రీరామమూర్తి(లేటు) మరియు ఇతరులు - JDR'S

వేలం ప్రకటన

డిక్రీబాకీ సొమ్ము వసూలు నిమిత్తం DHR పై నెంబరు గల పిటీషన్ దాఖలు చేసినారు. పిటీషన్‌లో షెడ్యూలు స్థిరాస్తి ది.28-8-2025వ తేదీన పైన తెలిపిన కోర్టులో శ్రీ కోర్టువారి సమక్షంలో బహిరంగం వేలం వేయబడును. కావున ఈ షెడ్యూలు దాఖల స్థిరాస్తిని వేలం పాటలో పాడుకొనదలచిన వారు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై పాడుకోవలసినదిగా తెలియజేయడమైనది. వివరాలు కావాల్సిన వారు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని గాని సెంట్రల్ నజారత్ వారిని కాని సంప్రదించవల్సిందిగా తెలియజేయడమైనది.

పిటీషన్ దాఖలు స్థిరాస్తి షెడ్యూలు

తూ.గో.జిల్లా, రాజమండ్రి ఉప విభాగం, రాజమండ్రి సవీష్‌పురం, మల్లికార్జుననగర్ 2-అంతస్థులు భవనం బేరింగ్ డో.నెం.57-3-771 in RS No. 102 of Plot No. 134A in an extent of 148 sq.yards is bounded by
East : Road-43Ft,
North : Road-31ft.,
South : House of Vange Subrahmanyam-31 Ft.,
West : Street Road -43ft.
DHR Value : Rs. 2,17,600/-
Amminavalue : Rs. 60,00,000/-
JDR value : Rs. 42,96,000/-
S.R.Value Rs. 38,48000/- for 148 Sq.yards G+1 Building or
Rs. 39,69,360/- For 1332 Sq.feet G+1 Building

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు
BARLA SRIKANTH
Advocate
D.No.77-9-33/8, Katari Gardens
Rajamahendravaram-533103.

సర్టిఫికెట్లు పోయినవి

నా క్లైంట్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఇందిరానగర్ డోర్.నెం. 64-25-56 కాపురస్తులు పులపకూర త్రిమూర్తులు తండ్రి పులపకూర సుబ్బారావు (లేటు) గారు ఇచ్చిన సంజాయిషి పై జనరల్ పబ్లిక్ యావన్మందికి తెలియజేయునది.

మా క్లైంట్‌కు చెందిన Board of secondary education certificate number 187026 మార్చి 2000 మరియు కరప మండలం పెద్దాపురప్పాడు ZP High School వారిచ్చిన ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (TC) ఒరిజినల్‌తో ది 03-08-2025వ తేదీన ఇంటి నుండి రాజా థియేటర్ దగ్గర జిరాక్స్ తీయించుటకు వెళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. సర్టిఫికెట్స్ ఎవరికైనా దొరికినచో మాకు తెలియజేయగలరు.

కాసూరి వెంకటరావు
నోటరీ & అడ్వకేట్ రాజమహేంద్రవరం
తూర్పుగోదావరి జిల్లా.
సెల్ : 98483 63423

NOTICE

IN THE COURT OF THE
I ADDL. DIST. JUDGE: GUNTUR

M.V.O.P.No.212/2022

Between :
Guggulothu Sailaja& Others .... Petitioners
And
Kanumuri Yesudas (Died)& Others .... Respondents

To,
R-3: Kanumuri Prem Kumar, S/o.Late Yesudas, R/o.Door No.4-79/3, Srinivasa Nagar, Teachers Colony, Vakalpadu, Near Water Tank, Kakinada, East Godavari Dist.

పై నెంబరు ఒ.పి.లో పిటీషనర్లు యాక్సిడెంటులో 2nd మరణించినందున నష్టపరిహారం కోరుచూ దాఖలు చేసిన పిటీషనులో 3వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది. 26-08-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షముందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేదీ : 26-08-2025

వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి
పిటీషనర్లు తరఫు న్యాయవాది, గుంటూరు

వాడపల్లి ఆలయానికి రూ.12లక్షల విలువైన బ్యాటరీ కార్లు అందజేసిన జెఎస్ఎన్ రాజు కన్స్ట్రక్షన్స్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి భక్తుల నుంచి విరాళాలు వరదలా చేరుతున్నాయి. ఈ క్రమంలో, జెఎస్ఎన్ రాజు కన్స్ట్రక్షన్స్ అధినేత జంపన పుల్లంరాజు తన తండ్రి జంపన సూర్యనారాయణరాజు పుట్టినరోజు సందర్భంగా రూ.12 లక్షల విలువైన రెండు బ్యాటరీ కార్లను దేవస్థానానికి విరాళంగా అందజేశారు. ఆలయ భక్తుల సౌకర్యార్థం ఈ వాహనాలను ఆగస్టు 15న వాహన పూజ అనంతరం సేవలోకి ప్రవేశపెట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదే రోజున తన తండ్రి పుట్టినరోజు కావడంతో ఆ రోజు ప్రారంభించాలనే అభ్యర్థనను దాత ఆలయ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా వాహనాల ప్రారంభం జరగనుంది. దాతృత్వం పట్ల ఆలయ అధికారులు, భక్తులు జంపన పుల్లంరాజు , జెఎస్ఎన్ రాజు కన్స్ట్రక్షన్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ బ్యాటరీ కార్లు భక్తులకు సులభ రవాణా సౌకర్యం కల్పించనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్తి పాడు మండలం పెద్ద శంకర్ల పూడి హైస్కూల్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పెద్దిపాలెం పిహెచ్సి వైద్యాధికారి యశస్వి కొండి పూడి ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్య ప్రభ హాజరయి మాట్లాడుతూ 19 సంవ త్సరాలలోపు వయస్సు ఉన్న విద్యార్థులు అందరూ తప్పకుండా ఆల్బెండజల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. వైద్యాధికారి యశస్వి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధిపై నులిపురుగులు ప్రభావం చూపుతాయని తెలియజేశారు. అనంతరం వైద్య సిబ్బంది ఎమ్మెల్యే సత్యప్రభను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి పిహెచ్సి వైద్యాధికారి గీతా సుధ, ఎంఈఓ వి రాజుబాబు, ఎంఈఓ 2 అచ్చిరాజు, హైస్కూల్ హెచ్ఎం జాన్ ప్రసాద్, పెద్దిపాలెం హెల్త్ సూపర్వైజర్ రామిశెట్టి రాంబాబు, కూటమి నాయకులు వరుపుల రామకృష్ణ, యళ్ళ జగదీష్, ఏ వెంకట్రావు, వెలుగుల నాని, మిరియాల శ్రీను, లొండ లోవరాజు, స్కూల్ చైర్మన్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలతో ఆక్వా రైతులు కుదేలు

- మోదీతో పవన్ మాట్లాడాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - కాకినాడ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశం నుండి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ, ఆక్వా తదితర ఉత్పత్తులపై పన్నులు 50 శాతం పైగా వేయటంతో ఆక్వా పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైందిని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆక్వా పరిశ్రమ సంక్షోభంలో పడి రైతులు దివాలాతీసే ప్రమాదం ఏర్పడిందిని దీనివలన మన దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారి పోతుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారని అన్నారు. కాకినాడ జిల్లాలో ఆక్వారంగ పరిశ్రమలో వందలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, ట్రంప్ విధానాలతో పరి శ్రమలు మూత పడితె మహిళల ఉపాధి అవకాశాలు దెబ్బతింటా యని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు చేసి రైతులు చెరువులు వేశారని, ఈ దెబ్బతో రైతులు తీవ్ర నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీసీఎం పవన్ కళ్యాణ్ మోడీతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలని కోరారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించండి

- సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్

విశాలాంధ్ర - ఏలూరు : సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో 79వ దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఉదయం గం.9లకు ఆర్.ఆర్. పేట, స్ఫూర్తి భవన్ నందు గల ఏలూరు ఏరియా సమితి కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సభ్యులు అనేక మంది వీరోచితంగా పోరాడి దేశ స్వాతంత్ర్య కాంక్షను ప్రజలలో ఉవ్వెత్తున రగిలించి,ప్రాణత్యాగాలు చేసి అమరులయ్యారని తెలిపారు. నాటి స్వాతంత్ర్య ఫలాలను ప్రజలందరికీ అందించడానికి దేశంలో అనేక ఉద్యమాలను నిర్వహించి,ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం వందేళ్లుగా భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని కొనియాడారు. ఆ వీరుల పోరాట చరిత్రను మననం చేసుకుంటూ దేశ స్వాతంత్రాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగ లౌకిక విలువలకు తిలోదకాలు ఇచ్చి బిజెపి చేస్తున్న మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర దినోత్సవాన్ని వాడ వాడలా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 15వ తేదీ జరిగే జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సమితి సభ్యులు,శాఖల కార్యదర్శులు,కార్మిక సంఘాల, ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు సమయానికి విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి, తూర్పు గోదావరి జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్టు శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు ఒక ప్రకటనలో తెలియ చేసారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాలో నీటి పారుదల సదుపాయాల మెరుగుదల, జాతీయ రహదారుల విస్తరణ, పర్యాటక రంగ అభివృద్ధి , గృహ నిర్మాణం , పోలవరం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల అభివృద్ధి, అలాగే గండి పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధి వంటి అంశాలను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమావేశం అనంతరం ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు గండి పోచమ్మ తల్లి చిత్రపటాన్ని అందజేశారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు బ్యానర్ల ప్రదర్శన నేరం

- కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : నగర సౌందర్య పరిరక్షణ దృష్ట్యా, పబ్లిక్ ప్రదేశాలలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు బ్యానర్ల ప్రదర్శన పూర్తిగా నిషేధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ప్రకటించారు. ఈ క్రమంలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ వారి నుంచి లిఖితపూర్వక ముందస్తు అనుమతి పొందకుండా నగరంలో ఎక్కడైనా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని, తాత్కాలిక ఫ్లెక్సీలు , బ్యానర్లు గరిష్టంగా 24 గంటలపాటు మాత్రమే ఉంచడానికి అనుమతిస్తామన్నారు. ఫ్లెక్సీలు , బ్యానర్ల సైజు సంఖ్య ఆధారంగా దరఖాస్తు సమయంలోనే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారికి రుసుము చెల్లించవలసి ఉంటుందని, నిర్దిష్టమైన సమయం పూర్తయ్యిన తరువాత తొలగించకపోతే. నిర్దిష్ట సమయం పూర్తి అయిన తరువాత వచ్చే 24 గంటలపాటు, దరఖాస్తు దారు అసలు రుసుము కంటే రెండింతలు రుసుము చెల్లించవలసి ఉంటుందన్నారు. 48 గంటలు గడిచినా తొలగించకపోతే, అసలు రుసుము కంటే మూడింతలు రుసుము వసూలు చేస్తామని, తదుపరి ఉల్లంఘన కొనసాగిన పక్షంలో, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు స్వయంగా తొలగించి, అందుకు అయ్యే ఖర్చు దరఖాస్తు దారుని నుండి వసూలు చేయడంతో పాటు మునిసిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని జాతీయ రహదారులు , రాష్ట్ర రహదారులు, సెంట్రల్ మీడియన్లు, ప్రభుత్వ భవనాల పరిసరాలు, కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ గల ప్రదేశాలు,మున్సిపల్ పార్కుల పరిసరాలు, ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల పరిసరాలు, దేవాలయాలు, చర్చిలు, మసీదుల పరిసరాలు, వారసత్వ నిర్మాణాలు , రక్షిత స్మారక చిహ్నాలు జలాశయాలు, ట్యాంక్ బండ్లు పాదచారుల మార్గాలు, నడక ట్రాక్‌లు, విగ్రహాలు, ట్రాఫిక్ సర్కిళ్ల పరిసరాలు ప్రజా మరుగు దొడ్లు, పట్టణ ప్రజా సౌకర్యాల పరిసరాలు, బస్ షెల్టర్లు , ఆటో స్టాండ్లు , సమాధి స్థలాలు , దహన స్థలాల పరిసరాలు , విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్లైఓవర్లు , పాదచారి వంతెనలు , రైల్వే వంతెనల పరిసరాలన్నీ నిషేధిత ప్రదేశాలని, వాటిని మినహాయించి ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రదర్శించుకోవచ్చన్నారు. ఈ సూచనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోంటామని ఆమె తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : పలు కేసు లలో ముద్దాయిలుగా ఉన్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 301 గ్రాముల బంగారం, 7 కేజీల వెండి వస్తువులతో పాటు రూ.5 లక్షల విలువ చేసే గృహోపకరణాలు మొత్తం 42 లక్షల రూపాయల చోరీ సొత్తును ముద్దాయిల వద్ద నుండి రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వెల్లడించారు. ఈ కేసులలో నేరస్థులుగా ఉన్న వేమగిరి హరీష్, మోర్త వెంకటేష్ అలియాస్ వెంకి, తణుకు దుర్గాప్రసాద్ అలియాస్ సూర్య, బండి ధర్మరాజు అలియాస్ గాబ్రియల్ లను రాజా నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న వీరయ్య గౌడ్ సమక్షంలో ఈనెల 10 వ తేదీ రాత్రి 11 గంటలకు అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేసుల్లో ఇంకను కేసు ప్రాపర్టీలను తాకట్టు పెట్టించిన ముద్దాయిలు గున్నూరి అశోక్, రాజేష్ అనేవారిని అరెస్ట్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 18 కాసుల బంగారపు వస్తువులు , 3 కేజీల వెండి వస్తువులు ఒక గ్లాంజా కారు, ఈ కేసులో సీజ్ చేశా రు. అలాగే వివిధ జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల కు సంబంధించిన వివిధ కేసుల్లోని బంగారం, వెండి నగలను, ఏసీలను, మంచాలను, ఫ్రిడ్జిలను, అలాగే కంచు సామాన్లను. టీవీలను కూడా రికవరి చేసి సీజ్ చేశారు. ఈ కేసులలో నేరస్తులను పట్టు కున్న రాజానగరం ఇన్స్పెక్టర్ . ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐలు ఎస్.ప్రియ కుమార్, ఎ.కె. సత్యనారాయణ, కె.వి. నాగార్జున, రాజానగరం క్రైం సిబ్బంది అమ్మిరాజు, సత్యన్నారాయణ, కరీం, బివి. రమణ, సురేష్, మురళీ లను ఎస్.పి. ఈ సందర్భంగా అభినందించి రివార్డులు అందించారు.

విద్యార్థుల హక్కులను కాలరాసే జీవోలను రద్దు చేయాలి

- విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి
- ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలో ఏలూరు జిల్లా గర్ల్స్ కన్వీనర్ లోకేశ్వరి

విశాలాంధ్ర - నూజివీడు : అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నూజివీడు నగరంలో ముడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐ ఎస్ఎఫ్ ఏలూరు జిల్లా గర్ల్స్ కన్వీనర్ లోకేశ్వరి మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులు రాజకీయ పార్టీలు అనుమతులేదని తీసుకువచ్చిన జీవోలు ఎవరి కోసం ఎవరి లబ్ది కోసమని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని కోరారు.దేశంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యను కాషాయకరణ చేయడానికి ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారి చరిత్రను చెరిపివేసి దేశం కోసం బ్రిటిష్ వారికి తొత్తు గా పనిచేసిన వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని తప్పు పట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని ఆ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనా రిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. యువగళం పాద యాత్రలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు.వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయకుండా జీవో నెంబర్ 107 108 రద్దు చేస్తామని చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు రాబోయే కాలంలో నిర్వహించేందుకు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో కో కన్వీనర్, రాజ్యలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరేళ్లనాటి మిస్సింగ్ కేసును చేధించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రావణ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఆరు సంవత్సరాల క్రితం కుటుంబ తగాదాల నేపథ్యంలో తన ఇరువురు పిల్లలతో పాటు ఇంటి నుండి వెళ్లిపోయిన ముగ్గురు వ్యక్తులను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు కనుగొని ఎట్టకేలకు వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో గత కొంతకాలంగా ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమం ద్వారా జిల్లాలో తప్పిపోయిన కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెతికిస్తున్నారు. ఇందులో భాగంగానే గత 6 సంవత్సరాల క్రితం తన భార్య బిడ్డలు కనిపించడం లేదంటూ ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో పోలీసులు పురోగతి సాధించి అందరి చేత శభాష్ అని పించుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మంగళ వారం ఏలూరులోని డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన

విలేకరుల సమావేశంలో డిఎస్పి శ్రావణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. 2019వ సంవత్సరం లో ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 222/2019 కింద ఒక మహిళ, ఆమె ఇద్దరు చిన్నా రులు (అప్పట్లో వయసు 3 సంవత్సరాలు మరియు 2 సంవత్సరాలు) ఆచూకీ తెలియడం లేదంటూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఎవరికి చెప్పకుండా ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీంతో వారికోసం కుటుంబ సభ్యులు, పోలీసు విభాగం తీవ్రంగా వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ తరుణంలో జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన "ఆపరేషన్ ట్రేస్" కార్యక్రమంలో భాగంగా స్పెషల్ టీమ్ ఇన్‌చార్జ్ మరియు కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట కుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ కనకాంబరం, హెడ్ కానిస్టేబుల్ పాండురంగరావు, కానిస్టేబుల్ విజయ్ కుమార్, మహిళా కానిస్టేబుల్ చైతన్య అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలో ఉన్నట్లు మహిళ ఆమె కుమారులను గుర్తించారు. దీంతో వెంటనే

స్పెషల్ టీమ్ వరంగల్ వెళ్లి మిస్సింగ్ వ్యక్తులను ఏలూరుకు తీసుకువచ్చి బంధువుల సమక్షంలో భర్తకు అప్పగించారు. ఎంతోకాలంగా తన భార్య బిడ్డల జాడ కోసం వెతుకుతున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో నిరాశ చెందిన తనకు తిరిగి తన కుటుంబాన్ని అప్పగించిన పోలీసులకు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసును చేదించిన కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట కుమార్, ఏలూరు రూరల్ ఇన్‌చార్జ్ ఎస్ఐ నాగబాబు, సిబ్బందిని డీఎస్పి అభినందించారు.